క్లుప్తంగా

సమస్యలపై మంత్రికి ఎమ్మెల్సీ చల్లా వినతి



అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ అంశాలపై ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు గురువారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. అలంపూర్ నియోజకవర్గంలో అలంపూర్ పట్టణంలోని ప్రజారోగ్య వైద్యశాలను అలంపూర్ చౌరస్తాకు తరలిస్తారని తెలియడంతో అలంపూర్ మండలంలోని 18 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతారని, అలంపూర్ నియోజక వర్గంలోని ప్రజలకు, జర్నలిస్టులకు, ఉద్యోగ సంఘాల వారికి ఏపీ మాదిరిగా ఆరోగ్యశ్రీ కార్డు వర్తింప చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనం సీజ్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అశోక్ లైలాండ్ వాహనంలో రెండు కోడెద్దులను డోన్ సంత నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్ ఫలక్‌నామాకు తరలిస్తున్నారు. ఎద్దులను తరలిస్తున్న షేక్ మహమ్మద్, షేక్ ఉమార్‌పై జంతు హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కోడేద్దులను గోశాలలో వదిలేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలూరులో ఘర్షణ : కేసు నమోదు

గట్టు: మండలంలోని ఆలూరులో గురువారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నర్సింహులు అలియాస్ దుబ్బన్నపై అదేగ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేసి, గాయపరిచారు. గాయపడిన న ర్సింహులును చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కూల్‌ఆఫ్ ఎక్సలెన్స్‌కు విద్యార్థినుల ఎంపిక



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు హైదరాబాద్‌కు ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ దేవానందం వారిని అభినందించారు. పుల్లూరు గురుకుల పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు చరిత, సుమిత్ర మెరిట్ పరీక్ష రాయగా, వారు హైదరాబాద్‌లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఎంపికైన సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

నీటి పొదుపే ప్రధానం

మానవపాడు: మండల కేంద్రంలోని వివిధ గ్రామాల్లో బుధవారం శుద్ధజలంపై ఎస్సీ జగన్‌మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడగంటాయని, ప్రతి ఒక్క నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, కూలీలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కుర్వపూర్ గ్రామానికి చెందిన రాములు అనుమతి లేకుండా ఇసుకను కుర్వపూర్ నుంచి పాతపాలెం వైపు తీసుకెళ్తున్నాడు. సమాచారం అందడంతో పోలీసులు పాతపాలెం శివారులోని ఇసుక ట్రాక్టర్‌ను రాత్రి 2:30 గంటల సమయంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

మానవపాడు: మండల కేంద్రంలోని జాతీయ రహదారి-44పై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. ఇటిక్యాల మండలంలోని చాగాపురం చెందిన పాస్టర్ దానియేల్ (57), కుమారుడు జాకోబ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కర్నూల్ వెళ్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు జాకోబ్ దిగాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం దానియేల్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతన్ని కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై జాకోబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు.

ఎరువుల నిల్వలపై నిఘా

- స్టాక్ వివరాలకు ఎఫ్ఐవీఎస్ యాప్ రూపకల్పన
- సీజన్ ముగిసే వరకు దుకాణాల్లోని నిల్వల నమోదు
- కృత్రిమ కొరతను నివారణకు వ్యవసాయ అధికారుల చర్యలు



ఫర్టిలైజర్ వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి

మానవపాడు: తెలంగాణలో రైతాంగానికి కృత్రిమ ఎరువుల కొరత నివారించేందుకు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల నిల్వలను కచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ఫర్టిలైజర్ ఇన్వంటరీ వెరిఫికేషన్ సిస్టం(ఎఫ్ఐవీఎస్) యాప్‌ను రూపొందించింది. దీనిలో భాగంగా వ్యవసాయ అధికారులు సీజన్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఫర్టిలైజర్ దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో తనిఖీ చేస్తూ యాప్‌లో సంబంధిత ఎరువుల వివరాలు నమోదు చేయిస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశించడంతో రైతులు వానాకాలం సాగు పనులు ముమ్మరం చేశారు. ఎరువుల కొరత ఏర్పడుతుందనే కారణంతో కొంతమంది రైతులు ఎరువులను ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ షాప్‌ల్లో ఎన్ని ఎరువులున్నాయి? ఎన్ని కొనుగోలు చేస్తున్నారు? రైతులకు కావల్సిన ఎరువులు ఎంత అవసరం(ఎఫ్ఐవీఎస్) యాప్ ద్వారా తెలుసుకోవచ్చని అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నారు.

వివరాలు పక్కాగా..

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 124 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో ఇటిక్యాల- 42, వడ్డేపల్లి - 35, ఐజ- 25, ఉండవెల్లి- 15, అలంపూర్- 10, రాజోళి-10, మానవపాడు- 6 ఆయా మండలాల్లోని ఆయా గ్రామాల వారీగా 143 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. మండలానికి ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉంది. వాటిలో మండల వ్యవసాయ అధికారులు అన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్నారు. ప్రతి వారంలో రెండు పర్యాయాలు తప్పనిసరిగా ఏఓ, ఏడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేయాలి. ఈ సందర్భంగా దుకాణాల్లో పాయింట్ ఆఫ్‌సెల్(పీఓఎస్) యంత్రాలు వినియోగిస్తున్నారా? లేదా? అనే వివరాలు తెలుసుకోవాలి. స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసిన తర్వాత ఎరువుల వివరాలను పరిశీలించి ఎరువుల నిల్వ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీని ద్వారా పంట సాగుకు రైతులకు ఎంత వరకు ఎరువులు అవసరం అవుతాయి? దుకాణాల్లో ఎంత నిలువ ఉంది? యాప్ ద్వారా ఉన్నతాధికారులు వివరాలు తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవచ్చు.



క్యాతూర్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ సక్రియా నాయక్

ఎరువుల కొరత లేకుండా చర్యలు

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన (ఎఫ్ఐవీఎస్) యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఎరువుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నాం. యాప్ ద్వారా ఏ దుకాణాల్లో ఏయే ఎరువులు ఎంత వరకు నిల్వ ఉన్నాయి, ఎంత వరకు కొనుగోలు చేశారు, ఈ విషయాలు యాప్ ద్వారా తెలుపుతాం. పంటల సాగు సమయంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– సక్రియా నాయక్, ఏడీఏ అలంపూర్ డివిజన్

అధిక ధరకు అమ్మకుండా చర్యలు



తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తర్వాత రైతులకు ఎరువుల అధిక ధరకు అమ్మకుండా బ్లాక్ మార్కెట్‌పై దృష్టి సారించి ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. కౌలుకు ఎక్కువ ధరకు తీసుకోని, పెట్టుబడులు పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఎరువుల రేట్లను, లిక్విడ్ రేట్లను నియంత్రించి రైతులకు న్యాయం చేయాలి.

– గోపాల్, రైతు గోకులపాడు

లిక్విడ్ మందుల రేట్లను అరికట్టాలి



ఫర్టిలైజర్ దుకాణాల్లో లిక్విడ్ మందులపై విపరీతంగా యజమానులు రేట్లకు అమ్ముతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాలపై దాడులు చేసి రైతులకు న్యాయం చేయాలి. రేట్లను అధిక ధరలకు అమ్ముతున్న వ్యవసాయ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎరువులు, లిక్విడ్ రెండింటిపై అధిక ధరలకు అమ్మకుండా రైతులకు సమయానికి ఎరువులు, లిక్విడ్ అందించేలా అధికార యంత్రాంగం, ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

– రంగస్వామి, రైతు, చెన్నిపాడు

ఎరువులను అందుబాటులో ఉంచాలి



తెలంగాణ ప్రభుత్వం ఎరువుల కొరత రాకుండా రైతులకు అందుబాటులో ఉంచాలి. వర్షాకాల సీజన్ ప్రారంభమై రైతులు విత్తనాలు విత్తుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అమ్మే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

– కుర్వ నరసింహులు, రైతు, మానవపాడు

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిల్లె గోపాల్

ఉండవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి మండలాల కార్యకర్తలకు సీపీఎం 13వ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కిల్లె గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభించి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ప క్క రాష్ట్రాలకు వైద్యం కోసం పరుగులు తీస్తున్నారన్నారు. వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు సరైన సమయంలో అధికారులు అందుబాటులో ఉండాలని, రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కల్తీ విత్తనాలపై ప్రత్యేక నిఘా ఉంచడమే కాకుండా, రైతులకు ఫర్టిలైజర్ అందుబాటులో ఉండేలా చూ డాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కా ర్యదర్శి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దిలేటి, రాజు, ఈదన్న, వెంకటేశ్వర్లు, రేపల్లె దాసు పాల్గొన్నారు.

చురుకుగా శానిటేషన్ పనులు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో శానిటేషన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల భారీ వర్షాలకు ప్రైవేటు ప్లాట్లు, గుంతల్లో నీరు నిలిచింది. 7వ వార్డులో నిలిచిన నీటిలో దోమల ఉధృతి పెరగడంతో జేసీబీతో కాల్వలు తవ్వి వర్షపు నీటిని బయటకు తరలించారు. వడ్డేపల్లి–శాంతినగర్ ప్రధాన రహదారి గుంతలమయమై ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో గుంతల్లో ఎర్రమట్టి నింపే కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది చేపట్టారు.

జీహెచ్ఎంగా బాధ్యతల స్వీకరణ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా గురువారం నారాయణచారి బాధ్యతలు చేపట్టారు. పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రజిత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు వారి శాఖలకు చెందిన తాజా నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. ఎంపీటీసీల పదవీ కాలం దగ్గరపడటంతో చివరి సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్ జ్యోషి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్ష పదవి సంపత్ కుమార్‌కు ఇవ్వాలి

అలంపూర్: రాష్ట్ర పీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ అధిష్ఠానం దళిత సామాజిక వర్గానికి చెందిన ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు కేటాయించాలని అలంపూర్ పట్టణయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవర పోగు నరసింహ అన్నారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం సంపత్‌కుమార్ ఎంతగానో కృషి చేశారన్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవికి సంపత్ సరైన వ్యక్తిగా భావించి పదవీ బాధ్యతలు అప్పగించాలని కోరారు. సమావేశంలో ఎల్ల న్న, బుచ్చన్న, రామకృష్ణ ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలకు పంపండి



సల్కాపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న నర్సింహులు



అయిజలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



శాంతినగర్‌లో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కరుణ, ప్రధానోపాధ్యాయులు



కేటీదొడ్డిలో పుస్తకాలు అందిస్తున్న రామకృష్ణనాయుడు

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ సకాలంలో యూనిఫాంను అందిస్తామని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు తెలిపారు. గురువారం సల్కాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఉచిత మధ్యాహ్న భోజ నం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందన్నారు. తల్లిదండ్రులు బడీడు పిల్లలను తప్పని సరిగా బడికి పంపాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం రాంమూర్తి, ఏపీఎం సాంబశివుడు, సీసీ జ్యోతి, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

అయిజ: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో కొనసాగుతోంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలల బలోపేతానికి ఏఏపీసీ సభ్యుల సహకారం ఉండాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యనందించాలని, మధ్యాహ్నం భోజనంలో పౌష్టికాహారం అందించాలన్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత

శాంతినగర్: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కరుణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

రాజోళి: విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించారు. ప్రభుత్వం పాఠశాల విద్యకు పెద్దపీట వేసిందని, విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందించి, మెరుగైన విద్య అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందిస్తారని వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుచినెర్లలో మాజీ సర్పంచ్ హైమవతితో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రక్తదానం చేస్తే పునర్జన్మనిచ్చినట్లే

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



రక్తదానం చేస్తున్న యువకులు

గద్వాల: రక్తదానం చేస్తే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మను ఇచ్చినట్లేనని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. ముదిరాజ్ మత్స్యసహకార సంఘం రాష్ట్ర నాయకుడు దౌదరపల్లి నాగరాజు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక 7వ వార్డులోని దౌదరపల్లి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తదానం అన్నింటికన్నా మిన్న అని, ఆపత్కాలంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాన్ని రక్షించవచ్చన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో రక్తం లభించక మృతి చెందిన సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించడానికి తమవంతుగా టీఎస్‌ఆర్ యూత్ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది టీఎస్‌ఆర్ యువత రక్తదాన శిబిరం నిర్వహించి ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అవకాశం లభించినప్పుడల్లా ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాగరాజు సతీమణి జయమ్మ, వార్డు ఇన్‌చార్జి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న అఖిలపక్షం నాయకులు

అయిజ: మండల కేంద్రంలో కొత్త బస్టాండ్–పాతబస్టాండ్‌ల మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. గురువారం కాంట్రాక్టర్ సిబ్బంది అప్రోచ్ రోడ్డు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు అక్కడకు చేరుకున్నారు. పనులు నిబంధనల మేరకు నాణ్యత తగ్గకుండా చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఏఈ మహేష్ అఖిలపక్ష కమిటీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. ముందుగా మట్టి రోడ్డు వేస్తామని, సైడ్ వాల్స్ ఏర్పాటు చేసి అనంతరం మెటల్ రోడ్డు వేస్తామన్నారు. రోలింగ్ పనులు పూర్తయిన అనంతరం బీటీ రోడ్డు వేయాల్సి ఉందని వెల్లడించారు. అప్రోచ్ రోడ్డు పనులు నెలరోజుల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొంకల బీసీ సంఘాల నాయకులు

శాంతినగర్: కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయంలో బీసీ కులాల మధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొంకల గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను గురువారం కలిసిన కొంకల బీసీ నాయకులు కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయమై వినతిపత్రం సమర్పించారు. 2017లో బీసీ కమ్యూనిటీ హాల్ పేరట రూ.5 లక్షలు మంజూరు కాగా కమ్యూనిటీహాల్ నిర్మాణానికి సరిపడకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. 2021లో బీసీ కమ్యూనిటీ హాల్ బదులుగా ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ అని నిధులు మంజూరు చేశారని, దీంతో ఒకే కులానికి సంబంధించినదిగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడితే మిగతా బీసీ కులాలమధ్య ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ సర్పంచ్ బతుకన్న, ఎనుముల నాగరాజు, క్రిష్ణ, వెంకట్‌నాయుడు, ఆంజనేయులుగౌడ్, మద్దిలేటి, గోపాల్ వున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్, ప్రధానోపాధ్యాయులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు శిరీష, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారనాయుడు పాల్గొన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ పిల్లలందరిని స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ధరూరువాసికి విద్యాదాత పురస్కారం



రవీంద్రభారతిలో డీఆర్ శ్రీధర్‌కు విద్యాదాత పురస్కారాన్ని అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ధరూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు గాండ్ల డీఆర్ శ్రీధర్‌కు విద్యాదాత పురస్కారం లభించింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, క్రీడా ప్రాంగణానికి అవసరమైన స్థలాన్ని వారి పూర్వికులు అందజేసినందుకు గాను వందేమాతరం ఫౌండేషన్ వారు ఈ పురస్కారాన్ని అందించినట్లు డీఆర్ శ్రీధర్ కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అందజేశారు. ధరూరు మండల వాసికి విద్యాదాత పురస్కారం వరించడం మండల ప్రజలు, విద్యావంతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల్లో కస్తూర్బా విద్యాలయం

అయిజ: మండల కేంద్రంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమస్యలకు నిలయంగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కేజీబీవీని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేజీబీవీ భవనంలో పైకప్పు పెచ్చులూడి పడిందని, విద్యార్థులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. మరుగుదొడ్లు శిథిలమయ్యాయని, సరైన వసతి లేకపోవడంతో విద్యార్థినులు పక్కన నిర్మించిన కళాశాల భవనంలోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిప త్రం అందజేస్తామన్నారు. లేనిపక్షంలో నిరసన చేపడుతారని హెచ్చరించారు. కా ర్యక్రమంలో భీమ్‌సేన్‌రావు, వీరయ్యచారి, భగత్‌రెడ్డి, చిన్నికృష్ణ, రాజశేఖర్ ఉన్నారు.